# చివరకు మిగిలేది!

సి.హెచ్. వెంకటరత్నం 'ద్వారకా'

"లారీ నీ దేనా?"

"నాదే, సార్?"

"అందులో సరుకు?"

"అదికూడా నాదే."

"లారీ ఓనరువి. సరుకు ఓనరువి నువ్వే నన్న మాట. బాగుంది. రేర్ కేసు. లారీ ఖరీదెంత?"

"ఒకటిన్నర లక్షలు. కొత్తగా కొన్నాను."

"పర్మిట్ లేకుండా సిమెంట్ స్మగుల్ చేసేందుకు కొత్త లారీ కొన్నా వన్నమాట. బాడుగలు కూడా తోల్తావా?"

"తోల్తాను."

"బాడుగల రూపంలో ఎంతొస్తుంది నెలకు?"

"ఖచ్చితంగా చెప్పలేను. సార్! నలభై యాభై వేలుంటుంది."

"ఆదాయం బాగానే ఉంది కదా. మరి ఇలాంటి దొంగ చాటు పనుల కెందుకు పూనుకుంటున్నావు? కోట్లకు పడగ లెత్తాలని వరుగా?"

"తమబోటి వారి దయ ఉండాలి గద. సార్!"

"మా దయేముంది ఇందులో! నీ చొరవ. ధైర్యం."

"చిత్తం."

"ఇంతకూ నే నడిగిం దేంత?"

"ఏభై వేలు...చాలా ఎక్కువ."

పెద్దగా నవ్వారు ముకుందరావుగారు. జేబురుమాలుతో బట్టతలమీద. మరచెంబులా ఉన్న ముఖంమీద పట్టిన చమట తుడుచుకున్నారు. కళ్ళద్దాలు చేతిలోకి తీసుకుని ఆ రుమాలుతోనే తుడిచి. మళ్ళీ వాటిని పెట్టుకున్నారు. వెనక్కు తిరిగి తన సీటులోకి పోయి కూచున్నారు. ఏడుస్తున్నట్లు శబ్దం చేసింది పాత కుర్చీ.

ప్రభుత్వ కార్యాలయం. గోడలకు బూజు వేలాడుతున్నది. చావలేక బతుకుతున్న మనుమల్లా నిలువలేక నిల్చున్న కుర్చీలు. మేజాలు. ఆఫీసరుగారి సీటు చుట్టూ రాక్స్ నిండా ఫైళ్ళు. కాగితాలు. దేశాన్ని పట్టుకున్న దరిద్రంలా వాటినిండా దుమ్ము. దరిద్రపు కంపులాంటి గబ్బిలాల కంపు.

ప్రభుత్వ కార్యాలయం ప్రజల సొమ్ము. ప్రజలెలా ఉన్నారో దాన్ని చూస్తే చాలు తెలిసిపోతుంది. ఊరి విషయం ఊరి గోడలు చెబుతాయన్నారు పెద్దలు.

కార్యాలయం ముందు చింతచెట్టు కింద టార్పాలిన్లు కప్పుకుని సిగ్గుతో తల వాల్చిన పూర్వసువాసినిలా నిల్చొని ఉంది లారీ.

ముకుందరావుగారు తమ ముందున్న టేబులు మీద చేతులు పెట్టుకున్నారు. ఒక చేత్తో పేపరు వెయిటును గోలీలా విలాసంగా తిప్పుతూ కళ్ళు పైకెత్తి అన్నారు: "నీ మీద కేసు పెడతా ననుకో..."

"బాబ్బాబూ! అంత పని చెయ్యకండి..."

"అంటే నిజంగా పెడతానని కాదు. ఒక వేళ పెడతా ననుకో. అది పరిష్కారమయ్యేందుకు ఎంత కాలం పడుతుంది?"

"తమ దయ. ఎంత కాలమైన పట్టవచ్చును."

"కనీసం ఆరు నెలలయినా తీసుకుంటుం దనుకుందాం. ఆ లోపల నీకు జరిగే నష్టమెంత?" కళ్ళెగరేశారు విజయగర్వంతో ముకుందరావుగారు.

ముకుందరావుగారి కెదురుగా చేతులు కట్టుకుని నిల్చున్న లక్షాధికారి స్మగ్లర్ గోవిందయ్య లాగి వదిలిన తీగలాగా అపాద మస్తకం కంపించి పోయాడు. "చాలా ఉంటుంది. బాబో" అని బావురుమన్నాడు.


"కనీసం నాలుగు లక్షలయినా ఉంటుందా? జీవితంలో మళ్ళీ మొదటి మెట్టుమీద నిలుచుంటావు. అవునా?"

"అసలు నేను బతికి ఉంటే గదా!"

"నీ ప్రాణం ఖరీదు కట్టను. అది రాజకీయ నాయకులు చేసే పని. నువ్వు లక్షణంగా బతుకుతావు. నీ లాంటి ధైర్యవంతులు. సాహసికులు. అతి తెలివివరులు. అత్యాశాపరులు లేకపోతే దేశం గతేం కాను? దేశ రాజకీయ నాయకుల గతేం కాను? ప్రజాస్వామ్యం గతేంకాను? ప్రజల గతేం కాను? అంత సులువుగా నిన్ను పోగొట్టుకోలేదు దేశం. అందరూ నిన్ను భద్రంగా కాపాడుతారు...భయపడకు." చిరునవ్వులు చిందిస్తూ ఆ పలుకులు పలికారు ముకుందరావుగారు. చాలా తెలివి గలవాడు.

"మీ రనవసరంగా నన్ను అదర గొట్టేస్తున్నారు. అంతకు తూగలేను.మరో మాట చెప్పండి."

"నే నడిగింది ముష్టి యాభైవేలు. అర్నెల్లు లారీ మూలపడితే నష్టం ఎంతో ఆలోచించుకో. నే నడిగింది నాకు పారేస్తే నీ లాభమెంతో ఊహించుకో. కేసు తోయించుకునేందుకు మరొకరికయినా ఇవ్వక తప్పదు కదా? నేను ఫిక్సెడ్‌గా అడుగుతున్నాను. అది ఫ్లెక్సిబుల్‌గా మారేటట్లు చేసుకొని ఊబిలో కూరుకు పోయావో అది నీ ఖర్మ. నీతో నా కవసరం ఉంది కాబట్టి ఇంత దూరం నీ మీద దయతలచి చెబుతున్నాను. ఆ మొత్తం



ఎంత మాత్రం మారదు. నీ ఇష్టం. కేసు చెయ్యమంటే అలా చేస్తాను. వద్దు బాబో అనుకుంటే నా మొత్తం నాకు కట్టెయ్. నీ లారీ, సరుకు తోలుకుపో. రెంటిలో ఏదయినా నా కిష్టమే. నీ కేం కావాలో కోరుకో." ముకుందరావుగారు కోపాన్ని నటిస్తూ సిగరెట్టు వెలిగించుకొని అగ్గిపుల్ల అవతల పారేశారు. సాలెగూడులో తగులుకున్న ఈగ తప్పించుకు పోలేదని ఆయనకు బాగా తెలుసు.

గోవిందయ్య వంచిన తల ఎత్తకుండా అలాగే నుంచున్నాడు. తన మనుమల్లో గోవిందయ్య పులి. స్మగ్లింగ్ కార్యకలాపాల్లో అఖండ ప్రతిభావంతుడు. కాలం కలిసి రానప్పుడు పులికూడా పిల్లి కావాల్సిందే మరి.

వ్యాపారం చెయ్యాలంటే రిస్కు తీసుకో గలగాలి. రిస్కు తీసుకోవటానికి ధైర్య సాహసాలు కావాలి. వ్యాపారంలో రిస్కు ఉన్నది గాబట్టి వ్యాపారస్థుడికి తగు మొత్తంలో లాభం పొందేందుకు హక్కు ఉందంటారు శాస్త్రకారులు.

స్మగ్లింగు లాంటి వ్యాపారం చాలా పెద్ద రిస్కు. శాల్తీలే గల్లంతు కావచ్చును. మామూలు వ్యాపారంలో డబ్బు మాత్రమే పోతుంది.

తెల్లవారేసరికి కోటీశ్వరులం కావాలనే ఆత్రగాళ్ళు ధన, మాన, ప్రాణాలను పణంగా పెట్టి ఇలాంటి వ్యాపారంలోకి దిగుతారు. వీరు ఇతరులకు ముట్ట చెప్పే డబ్బుకూడా ఎక్కువగానే ఉంటుంది. ఇచ్చే వాళ్ళకు, తీసుకునే వాళ్ళకు ఒకటే ఆరాటం-తెల్లవారేసరికి అఖండైశ్వర్యానికి అధిపతులం కావాలని. వెంట్రుకతో కొండను లాకే వాలనే దుస్సాహసమే అందరిదీ!

డబ్బిచ్చి పనులు సాధించుకోటం కొత్తేమీ కాదు గోవిందయ్యకు. ఇంత పెద్ద మొత్తం ఒక్కసారిగా ఒక్క వ్యక్తికి నిష్కారణంగా ఇవ్వటమా అనేదే అతని బాధ. ఏమరుపాటు వల్ల పట్టుబడ్డాడు. ఏమరుపాటు ఖరీదు ఇంత ఎక్కువా?

"పెట్టుబడి, రిస్కు రెండూ లేని వ్యాపారం మీది." గోణిగాడు గోవిందయ్య అక్కసు వెళ్ళగక్కుతూ.

ముకుందరావుగారు వికటాట్టహాసం చేశారు. కప్పునుంచి వేలాడుతున్న బూజు పేలికలు విలవిలాడాయి. "పెట్టుబడి. రిస్కు...రెండూ లేవా! ఎంత అజ్ఞానివయ్యా. గోవిందయ్యా? ఈ సీటులో కూచునేందుకు నే నెంత చెల్లించానో. చెల్లిస్తున్నానో నీ కేం తెలుసు? ఎవడయినా పట్టుకుంటే నేను. నా సంసారం ఏమవుతాము?"

"చిత్తం" అన్నాడు గోవిందయ్య. నువ్వూ నీ సంసారం ఏ గంగలో కొట్టుకుపోతే నా కేమిటి అన్న భావం అందులో ఉందేమో. ఇటువంటి వాళ్ళు ఇతరుల గురించి పట్టించుకోరు.

"అనవసర కాలయాపన జరగటం, ఇది అందరి కళ్ళలో పడటం మన ఇరువురికీ క్షేమం కాదు. త్వరగా తేల్చు." గద్దించారు ముకుందరావుగారు, ముఖం మాడ్చుకొని.

"అలాగే ఇంటికి పట్టుకొస్తాను. లారీ వదిలెయ్యండి."

"నిన్ను నమ్ముతాను. లారీ వదిలేస్తే ఇంక నా చేతుల్లో ఏమీ ఉండదు లెమ్మనుకునే అమాయకుడివి కాదన్న నమ్మకం నా కుంది. అలాగే కానివ్వు."

ముకుందరావుగారు కుర్చీలోంచి లేచారు. కలకలమని నవ్వేం దది.

ముఖం మాడ్చుకుని గోవిందయ్య బోనులోంచి బయట పడ్డాడు. సిద్ధంగా ఉన్న డ్రయివరుకు లారీ లాగించమని సెగ చేశాడు. విజయోత్సాహంతో డ్రయివరు సీట్లోకి లంఘించి వాహనాన్ని ముందుకు దూకించాడు.

ఆ రోజు తన విధ్యుక్త ధర్మాన్ని ముగించుకొని ముకుందరావుగారు గృహోన్ముఖు లయ్యారు.

xx xx xx

ముకుందరావుగారి ఆఫీసుకు-ఇంటికి నరకానికీ-స్వర్గానికీ ఉన్నంత తేడా.

ముందు సంవత్సరమే మురపెంగా కట్టించుకున్నారు ముకుందరావుగారా ఇంటిని. తీర్చి దిద్దినట్లున్నది అధునాతనమైన బంగళా. నీడలు తేలుతూ గోడలు. మొజాయిక్ ఫ్లోరింగ్. ఇంటినిండా ఫర్నిచరు. ఇంటి చుట్టూ కాంపౌండు. చక్కని పూలతోట.

ఇంటికి పోర్టికో ఉంది కాని, అందులో కారు లేదు. బోసిగా ఉన్నది. ముకుందరావుగారికి, ఆయన బంధు మిత్రులకు ఆ లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. దాన్ని కొత్త కారుతో నింపాలని ముకుందరావుగారి ముచ్చట.

కారు ఆయన శక్తికి మించిందేమీ కాదు. వెంటవెంటనే అన్నీ కనబడిపోతే కానివాళ్ళు కళ్ళలో నిప్పులు పోసుకుంటారని ఆయన భయం. అంత తొందరేముంది? ఇంటి సందడి కాస్త తగ్గిం తరవాత తెచ్చుకోవచ్చును. అప్పు చేసి ఇల్లు కట్టనని అందరి ముందూ తన కష్టాన్ని వెళ్ళబోసుకున్నారు. అప్పుచేసింది నిజమే కాని, అది లేందే ఇల్లు కట్టుకోలేని అర్భకుడు మాత్రం కాదు ముకుందరావుగారు. తల్లిదండ్రులనుండి దండిగానే ఆస్తి సంక్రమించింది. అత్తగా రిచ్చిన కట్నం. అన్నిటినీ మించి గీతం రాళ్ళు. తోడుగా జీతం.

అన లంత మాత్రం స్థితిపరుడు గాకపోతే ఆయనకు ఈ డిపార్టుమెంటులో ఉద్యోగం ఎలా వచ్చేది? అన్నీ ఉండేవారికే ఏ యోగమయినా అబ్బేది.

xx xx xx

ముకుందరావుగారికి ఒకడే కొడుకు, ఒకతే కూతురు. అంతకు మించి కని సంసార భారాన్ని పెంచుకోలేదు.

దైవభక్తికూడా ఎక్కువే ముకుందరావుగారికి. ప్రతి ఉదయం ఒక గంట సేపు దైవధ్యానంతో పూజామందిరంలో గడుపుతారు విధిగా. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకొని కళ్యాణ మహోత్సవం జరిపిస్తారు. 'యద్రాత్రాత్ కురుతే పాపం తద్రా త్రాత్ ప్రతి ముచ్యతే' అన్నట్లు ఏ సంవత్సరాని కా సంవత్సరం పాప ప్రక్షాళన చేసుకుంటూ ఉంటారు. అన్ని అనర్థాలకూ మూలం డబ్బే నంటే-నేనా డబ్బుకే మూలమవుతాననే రకం ముకుందరావుగారు.

ఒక సంవత్సరం కళ్యాణోత్సవం జరిపి ఇంటికి తిరిగి వచ్చిన రోజునే కొడుకు పుట్టాడు . కళ్యాణ చక్రవర్తి అని ప్రియంగా పేరు పెట్టుకున్నారు.

కళ్యాణ చక్రవర్తి చిన్నప్పటినుంచి ఆడింది ఆటగా, పాడింది పాటగా పెరిగాడు. చదువు సంధ్యలు అంతగా అబ్బలేదు చక్రవర్తికి. తన శక్తినంతా ఉపయోగించి కొడుకును హైస్కూలు దాటించారు ముకుందరావుగారు. పరీక్ష పాసయినందుకు బహుమతిగా కుమారుడికి స్కూటరు కొని పెట్టాడు తండ్రి.

కాలేజీలో మొదటి సంవత్సరం హైలా హవ్వీసుగా గడిచిపోయింది చక్రవర్తికి. చేతిలో స్కూటరు. జేబులో డబ్బులు... స్నేహితులకు తక్కువేముంటుంది? తన ఈడువా రందరికీ ఆరాధ్యుడే అయినాడు. అతని చుట్టూ తయ్యకుండా పెద్ద బృందమే ఉంటుంది. కాలేజి అమ్మాయిలకు అతను అందాల చందమామ అయినాడు.

రెండో సంవత్సరంలోకి చేరేసరికి కళ్యాణచక్రవర్తి చాలా ఖరీదయిన విద్యార్థి అయినాడు. తండ్రి అతని కోసం చాలా ఖర్చు చేస్తున్నాడు. అందుకు

## కుసుమ కేతనం

**ఎవరో** నరుక్కుపోయిన మోడు
ఈ వేళ ఉగాదినాడు చిగురిస్తున్నది;
జడము చైతన్యవంతమై
సంవత్సరాదినాడు మురిపిస్తున్నది.

ఛిన్నోపి
రేహతి తరుః

మోడును మేడగా చేసుకుని
తోడులేని గరుత్మంతు డొకడు
ఆకాశం వైపు ఎగా దిగా చూస్తూ
అలా కూర్చుని ఉన్నాడు.
మదనేక్షు ధనుర్వినిర్గతమైన
మృదు బాణావాళి కోటి కోటి
పువ్వులై మోడుమీద వర్షించి
నవ్వుతున్నాయి గరుత్మంతుణ్ణి చూచి.
ఊరికే చెట్లు నరికే వారు
ఒక్క మొక్కనైనా నాటలేరు
చేదు వేపను ఛేదిస్తారు
రసాల తరువును రంపాన కోస్తారు.

జ్వాలల్లా ప్రజ్వలిస్తూకూడా చుర్రుమనని
పాలాశ కుసుమారుణ వనవాటికలో
వసంతుడు ప్రవేశించడానికి ప్రయత్నిస్తే
వద్దని అడ్డుపడే వారుంటారు కొందరు.
ఎర్రగన్నేరు పూలతో అందగించు చోట
ఎర్రగా రుధిరం చిందరాదు ఈ పూట;
దురాశా దుష్ట హృదయాలలో
శిరీష కుసుమ సౌకుమార్యం వట్టి మాట

శుకరథం మీద వస్తున్న వసంతుడికి
సుమపథం మీద వేంచేస్తున్న మదనుడికి
పూల జండాలతో స్వాగతం పలకాలి
ఈ లోకాన్ని నందనవనం చేయాలి.

గుండెలో పూలవానలు కురియువేళ
మండుటెండకు జంకెడు మనుజు డెవడు?
ఎండ రేయెండగా చేయ లెండు! రండు!
ఈ ఉగాది ఉత్సవ మధురోదయాన.

-డాక్టర్ దాశరథి

మన విచారించటం లేదు. విచారించాల్సిన అవసరం మాత్రం ఏముంది? రెండు చేతులా సంపాదిస్తున్నది ఎవరి ఆనందం కోసం!

కళ్యాణ చక్రవర్తికి నాయకుడి లక్షణాలు అలవాటయినాయి. అందుకు మిత్రుల ప్రోత్సాహం, ప్రోద్బలం సాయపడ్డాయి. మిత్రుల కోరిక మేరకు విద్యార్థి సంఘ ఛైర్మనుగా పోటీకి నిలబడ్డాడు. అతనికి గట్టి ప్రత్యర్థే తటస్థపడ్డాడు. దేశంలో నాయకులు కాగోరేవారికి కొరతేమున్నది గనుక!

మంచినీళ్ళ ప్రాయంగా అభ్యర్థు లిద్దరూ డబ్బు ఖర్చు చేస్తున్నారు. గోడలమీద రాతలు, వాల్‌పోస్టర్లు, మైకులు, లౌడు స్పీకర్లు, రిక్షాలు, వాన్లు...ఒకర్ని మించి ఒకరు ఏర్పాటు చేస్తున్నారు. ఆలోచనలు లేని మనుషుల దగ్గర ఆకర్షణలే పనిచేస్తాయి. మిత్రులకు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతా హడావుడి. కోలాహలం. కొంతమంది ఆడపిల్లలు బహిరంగంగానే కోపులు కాస్తున్నారు. తారస్థాయిలో ప్రచారం కొనసాగుతున్నది.

ముద్దుల కొడుకు మురిపాలు చెల్లించటానికి ముకుందరావుగారు ఎన్నడూ వెనుకాడలేదు. అవలీలగా వేలకు వేలు తెచ్చి పోస్తున్న దెవరి కోసం? కొడుకు సంతోషిస్తుంటే చూసి తను సంతోషపడాలని కాదూ! ఇప్పుడు ఖర్చు చేసినా అంతకు మూడంతలు అడక్కుండానే కట్నం రూపంలో వచ్చి వాలవూ? ఎలాగో బి.ఎ.అనిపిస్తే చాలు. లాభసాటి ఉద్యోగంలో వేయించి హోదా కూడా సంపాదించి పెట్టవచ్చును.

డబ్బు ఎంత ఖర్చు చేసినా ఫరవాలేదు. తీరా ఎన్నికల్లో నెగ్గలేకపోతే ఏదయినా అఘాయిత్యానికి పాల్పడుతాడేమోనని ముకుందరావుగారి భయం.

ఎన్నికల తేదీ వచ్చింది. ఫలితాలు ప్రకటించే సమయానికి కొడుకు పక్కనే ఉండాలని నిర్ణయించుకున్నారు ముకుందరావుగారు. తగిన జాగ్రత్తలు తీసుకోవలసిందిగా చక్రవర్తి మిత్రులకు ముందుగానే చెప్పాడు. కొడుకు సంతోషంలోను, అవసరమైతే విషాదంలోను భాగం పంచుకునేందుకు కాలేజీకి చేరుకున్నారు ముకుందరావుగారు. తన ఒక్కగా నొక్క కొడుకు భవిష్యత్తు దీంతో ముడి పడి ఉంది.

xx xx xx

కాలేజీ రీడింగురూములో సుఖాసీనులయి ఉన్నారు ముకుందరావుగారు.

ప్రిన్సిపాలుగారి గదిలో ఓట్ల లెక్కింపు జరుగుతున్నది.

ఎప్పటికప్పుడు సమాచారం అందుతూనే ఉంది. చక్రవర్తి తన ప్రత్యర్థి కంటె పైచేయిగానే ఉన్నాడు. జయం నిశ్చయం. ముకుందరావుగారు ఆనందోద్వేగంతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

ఈ క్షణంలోనో, మరు క్షణంలోనో విజయ వార్త అందుతుంది.

ఇంతలో జయ జయధ్వానాలతో కాలేజి దద్దరిల్లి పోయింది. ఎటు చూచినా ఉరుకులు, పరుగులు. చక్రవర్తిని చేతులమీద మోస్తున్నారు మిత్రులు. విజయోత్సవ సంరంభం ప్రారంభమైంది.

చక్రవర్తి విజయం ముకుందరావుగారి పట్లకనలు తియ్యదనమైంది. కాలు చల్లదనమైంది. ముందు డస్కు మీదికి వాలిపోయారు.

విజయోత్సాహంలో చక్రవర్తి తండ్రిమాటే మరిచిపోయాడు.

xx xx xx

రీడింగురూము తలుపులు మూస్తూ లైబ్రరీ అటెండరు ముకుందరావుగారి శరీరాన్ని చూశాడు. పరుగున పోయి ప్రిన్సిపాలుగారికి విషయం నివేదించాడు.

చెయ్యాల్సిన పని చేశారు ప్రిన్సిపాలుగారు.

అంతిమ యాత్ర ప్రారంభమయ్యేలోగానే ముకుందరావుగారి ఇంటి ముందు పోలీసులు ప్రత్యక్షమయ్యారు. పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించటానికో, లేక లంచగొండి అధికారిని పట్టుకునేందుకో!

పుత్రోత్సాహం విలువ అంత ఎక్కువగా ఉంటుందని ముకుందరావుగారు అనుకొని ఉండరు.

డబ్బు గుంజు కున్నంత తేలికగ కాలాన్ని గుంజుకోలేము కదా మరి. ఇది అందరికీ తెలిసిన సత్యమే. ముకుందరావుగారికి కూడా తెలుసు. ★

# ప్రతీక్షణం

"వెళ్ళిపోయావు నీవు
ముళ్ళ పూదివె లల్లుకొన్న దీర్ఘనిశా పథములవైపు
వెళ్ళిన నీవు మళ్ళీ రావని తెలుసు నాకు;
అయినా నా ఈ జీవిత చీకటి దారుల్లో
మిణికే మిణుగురులా 'ఆశ'
అది అంతరాంతరాలలో ప్రతిధ్వనించే బాస;
నీ వొస్తావని, కళ్ళల్లో మిలియన్ల మైనపు దీపాలు వెలిగించి
దిగంతాల ఊడల నీడల్లో అన్వేషిస్తాను నీ కోసం.
వత్సరాలు, శతాబ్దాలు, యుగాలు గోళాలై దొర్లుకుపోతాయి నాలో
నీ కురుల లతా నికుంజానికి కుసుమించిన పూవునై
నీ కాటుక కనులలో జాలువారే కాంతి పుంజాన్నై
నీ నాసికా మురళీద్వయం పలికే ఉచ్ఛ్వాస నిశ్వాసల 'హిందోళ' రవళినై
నీ పెదవుల ఇంద్రధనుస్సులపై నడయాడే దరహాస చంద్రికనై
నీ గళసీమలో కదలే పాటల సెలయేరునై
ఒదిగి పోవాలని నేను...కానీ నీవు రావు...
ఎప్పుడో, ఎక్కడో నా శిథిల జీవిత సమాధి కుడ్యాల్లో
నీ వేసిన కోర్కెల బీజాలు - అవి పెరిగి వటవృక్షాలై ఇప్పుడు ఊడలు చాస్తున్నాయి
వాటిని నా అశ్రుధారలతో ఇక పెంచలేను
బ్రతుకంటే ఇదేనని ఎంచలేను
నా గుండె రగిలే బాధల కుంపటి. అది తరగని గాథల సంపుటి
శూన్యవీథుల్లో నిశ్శబ్దపు ఒయారం.
సాంధ్య నిశీథుల నడుమ ఒరిగిపోతున్న ఇనబింబం
మోడువోయిన కాంతారం, మండుతున్న మైదానం
ఇంకిన సెలయేటి వియోగం ... ఇవన్నీ నా అనుభూతుల కావ్యం ...
నీవులేక వెన్నెల వన్నె చెదరిపోయింది
నా బతుకు కోకిల కంఠం మూగవోయింది.
నీ వెళ్ళిన దారి ఒయాసిసుల్లేని ఎడారి
అది వెలుగు కురవని చీకటి గుయ్యారం.
ఎన్ని వసంతాలు, ఎన్ని హేమంతాలు, ఎన్ని శిశిరాలు ...
ఇలా గడిచిపోతున్నాయో. అయినా నీ కోసం శిలలా మిగిలే ఉన్నాను.
నీటిలోని చేప కదలిక వినినప్పుడు
పల్లవాగ్రసీమలనుండి పవన శారికలు పలుకరిస్తున్నప్పుడు
నీవేనని చూస్తాను. కానీ నీవు కాదని తెలిసి మూగవోయి రోదిస్తాను.
ఎపుడయినా ఈ దారిని వస్తావని
ధూళినై నీ పాద స్పర్శకోసం వేచియున్నాను.
నే నున్నానన్న ఒక్క తలవు చాలు నీలో ఎన్ని యుగాలయినా ఇలా ఉండిపోతాను ఈ ఇలలో.
నీవు నడిచే దారిలో
నా ఎద తివాచీ పరచి ఉంచాను
ఎక్కడ నీ మృదు పదములు కందిపోతాయోనన్న బాధతో.
అయినా నీవు రావు. అందుకే ఒంగిన ఆకాశం వంకకు నా పయనం
గమ్యం చేరుకోవడమే దాని వైనం.
ప్రతి క్షణం ప్రతీక్షణం
నీ కోసం స్వప్నాల సుమవాటికలో
కోర్కెల కొమ్మకు పూసిన పుష్పంలా
శిథిలమై ... శీర్ణమై
ఏదో ఒక నాటికి రాలిపోతాను నీ ముందు ...

- అవనిగడ్డ సూర్యప్రకాష్